అథ్లెట్లు అదరగొట్టేనా?

పతక రేసులో అవినాశ్ సాబ్లె, పారుల్, జ్యోతి నీరజ్‌పై భారీ అంచనాలు

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

మరో వారం రోజుల్లో తెరలేవనున్న పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు కచ్చితంగా పతకం వచ్చే ఈవెంట్లలో అథ్లెటిక్స్ ఒకటి. టోక్యో ఒలింపిక్స్ (2020)లో ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్‌లో భాగంగా జావెలిన్ త్రో విభాగంలో పసిడి గెలుచుకున్న నీరజ్ చోప్రా.. మరోసారి ముప్పన్నెల పతాకాన్ని రెపరెప లాడించాలని దేశం కోరుకుంటోంది. గత మూడేండ్లుగా నిలకడగా రాణిస్తున్న నీరజ్ మరోసారి పసిడి త్రో విసిరేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో అతడితో పాటు మిగిలిన అథ్లెట్లూ విశ్వక్రీడల్లో చరిత్ర సృష్టించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈసారి అథ్లెటిక్స్‌లో 29 మందితో బరిలో దిగుతున్న భారత్‌కు అథ్లెట్లు ఏ మేరకు పతకాలు పట్టుకొస్తారో..!

'గోల్డెన్ బాయ్'పైనే ఆశలు

క్రికెట్‌కు విపరీతమైన క్రేజ్ ఉన్న భారత్‌లో టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన తర్వాత నీరజ్ చోప్రా వారికి ఏమాత్రం తీసిపోని స్థాయిలో క్రేజ్ సంపాదించాడు. ఒర్మాక్స్ మీడియా నివేదిక ప్రకారం మనదేశంలో 10 మంది టాప్ ఫేవరేట్ అథ్లెట్లలో కోహ్లీ, రోహిత్, ధోనీ వంటి దిగ్గజాలతో పోటీపడిన నీరజ్ 7వ స్థానంలో నిలిచాడంటే అతడి క్రేజ్ అర్థం చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ ఆకర్షణలే గాక ఫీల్డ్ లోకి దిగి జావెలిన్‌ను విసిరాడంటే అది ఆకాశంలో తారాజువ్వలా దూసుకుపోవాల్సిందే. 2018లో ఆలిండియా ఇంటర్ సర్వీసెస్ మీట్‌లో స్వర్ణం గెలిచిన తర్వాత అతడు పాల్గొన్న 23 ఈవెంట్లలో ఏ ఒక్కదాంట్లో కూడా పోడియం (టాప్-3) ఫినిష్ చేయకుండా వదల్లేదు. ఇక 'టోక్యో' తర్వాత 17 టోర్నీలలో పాల్గొని 11 ఈవెంట్స్‌లో ప్రథమ స్థానం దక్కించుకున్నాడంటే అతడి నిలకడను అర్థం చేసుకోవచ్చు. గత కొంతకాలంగా '90 మీటర్ల మార్కు' కోసం తపిస్తున్న నీరజ్‌కు ఈ సీజన్‌లో బెస్ట్ త్రో 88.36 మీటర్లు. అంతర్జాతీయ స్థాయిలో తనకు ప్రధాన పోటీదారులుగా ఉన్న జకుబ్ వడ్లెచ్ (88.65 మీటర్లు), జులియన్ వెబర్ (88.37 మీటర్లు) నీరజ్ కంటే కాస్త మెరుగ్గా ఉన్నారు. మ్యాక్స్ డెహ్నింగ్ ఈ ఏడాది ఫిబ్రవరిలో 90.20 మీటర్లు విసిరి నీరజ్‌కు గట్టి సవాల్ విసురుతున్నాడు. అయితే కొంతకాలంగా యూఎస్ఏలో ప్రత్యేక శిక్షణ పొందిన నీరజ్.. 'పారిస్'కు ముందు అక్కడ జరిగిన డైమండ్ లీగ్‌కు దూరంగా ఉండి విశ్వక్రీడల కోసం పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతూ 'డబుల్ గోల్డ్'పై కన్నేశాడు. ఇదే ఈవెంట్‌లో మరో జావెలిన్ త్రోయర్ కిషోర్ కుమార్ జెనా పోటీపడుతున్నా చాలాకాలంగా అతడు 80 మీటర్ల మార్కును దాటడం లేదు.

జ్యోతి మెరిసేనా..

అంతర్జాతీయ స్థాయిలో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ గత కొంతకాలంగా సత్తా చాటుతూ భారత్‌కు పతకం మీద ఆశలు కల్పిస్తోంది. 100 మీటర్ల హర్డిల్స్‌లో బరిలోకి దిగుతున్న జ్యోతి.. 12.78 సెకన్లతో సీజన్ బెస్ట్‌ను నమోదు చేసింది. వరల్డ్ ర్యాంకింగ్స్ ద్వారా పారిస్‌కు సెలక్ట్ అయిన జ్యోతి సెమీస్ వరకు చేరినా పతకం ఖాయం చేసుకున్నట్టే.

సాబ్లె సాధించేనా..

నీరజ్‌తో పాటు ఈసారి భారత్‌కు పతక ఆశలు రేపుతున్న మరో అథ్లెట్ అవినాశ్ సాబ్లె. పురుషుల 3000 మీటర్ల స్టీపుల్ చేజ్‌లో నిలకడగా రాణిస్తున్న ఈ బీడ్ (మహారాష్ట్ర) యువకుడు.. ఇటీవలే 'నేషనల్ బెస్ట్' (8:09.91 నిమిషాలు)తో ఆసియాలోనే నాలుగో అత్యుత్తమ గణాంకాలు నమోదుచేశాడు. టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన్నప్పటికీ ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమైన అతడు.. 2022లో ముగిసిన కామన్వెల్త్ గేమ్స్‌లో రజతంతో మెరిశాడు. గత రెండేండ్లలోనూ పలు ఈవెంట్లలో రాణిస్తూ పతకంపై ఆశలు రేపుతున్నాడు. ఇదే ఈవెంట్ మహిళల విభాగంలో పారుల్ చౌదరీపైనా ఈసారి అంచనాలున్నాయి. ఆమె 5000 మీటర్ల మహిళల స్టీపుల్ చేజ్ ఈవెంట్‌లోనూ పాల్గొంటోంది.

వీరికి తోడు షాట్‌పుట్‌లో తజిందర్ పాల్ సింగ్, పురుషుల 4X400 మీటర్ల రిలేలో మహ్మద్ అనాస్, మహ్మద్ అజ్మల్, అమోజ్ జాకబ్, రాజేశ్ రమేశ్, సంతోష్, చాకో కురియన్, ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్, అబ్దుల్లా అబూబకర్, హైజంప్‌లో సర్వేశ్ కుశారె, మహిళల జావెలిన్ త్రో లో అన్నూ రాణిపై భారత్ ఆశలు పెట్టుకుంది.

ఇంగ్లండ్ 'బజ్‌బాల్' దూకుడు

నాటింగ్‌హామ్: 'బజ్‌బాల్' ఆటతో టెస్టు క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కిస్తున్న ఇంగ్లండ్ క్రికెట్ జట్టు స్వదేశంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులోనూ దూకుడుగా ఆడుతోంది. ట్రెంట్‌బ్రిడ్జ్ (నాటింగ్‌హామ్) వేదికగా గురువారం మొదలైన రెండో టెస్టులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. మొదటి రోజు 88.3 ఓవర్లకు 416 పరుగుల భారీ స్కోరు చేసి ఆలౌట్ అయింది. ఓలీ పోప్ (121) టెస్టులలో ఆరో శతకానికి తోడు డకెట్ (71), స్టోక్స్ (69) రాణించడంతో తొలిరోజే ఆ జట్టు భారీ స్కోరు నమోదుచేసింది.

టెస్టులలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ..

ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 4.2 ఓవర్లలోనే 50 పరుగుల మార్కును అందుకుని చరిత్ర సృష్టించింది. రెడ్ బాల్ క్రికెట్‌లో ఒక జట్టుకు ఇదే అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీ. 30 ఏండ్ల క్రితం 1994లో ఇదే ఇంగ్లండ్.. దక్షిణాఫ్రికాపై 'ది ఓవల్'లో 4.3 ఓవర్లలోనే 50 రన్స్ చేసింది.

మోటార్ రేసింగ్‌లోకి అర్జున్

న్యూఢిల్లీ: భారత్‌లోప్రముఖ మోటార్‌స్పోర్ట్స్ ఈవెంట్..ఇండియన్ రేసింగ్ ఫెస్టివెల్(ఐఆర్ఎఫ్)-2024 సీజన్‌కు రంగం సిద్ధం అయ్యింది. ఈ లీగ్‌లో ఇప్పటికే క్రికెట్ దిగ్గజం సౌరభ్ గంగూలీ భాగం కాగా, తాజాగా బాలీవుడ్ యువ హీరో అర్జున్‌కపూర్..ఢిల్లీ డెమాన్స్ టీమ్‌తో జట్టు కట్టాడు. అర్జున్ చేరికతో లీగ్ మరింత ఆకర్షణీయంగా మారనుందని ఆర్‌పీపీఎల్ ఎండీ అభిలేష్‌రెడ్డి పేర్కొన్నారు. వచ్చే నెలలో లీగ్ జరుగనుంది.

PARIS 2024 — 7 రోజుల్లో

హార్దిక్, నటాషా విడాకులు

అహ్మదాబాద్: టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన భార్య నటాషా స్టాంకోవిచ్‌తో నాలుగేండ్ల వైవాహిక బంధానికి ముగింపు పలికాడు. గత కొంతకాలంగా ఈ ఇద్దరూ విడిపోతారని వార్తలు వస్తున్న నేపథ్యంలో గురువారం హార్దిక్, నటాషా సోషల్ మీడియా ద్వారా సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. 'నాలుగేండ్ల పాటు కలిసున్న తర్వాత నేనూ, నటాషా విడిపోవాలని పరస్పరం నిర్ణయించుకున్నాం.ఇది చాలా కఠినమైన నిర్ణయం' అని ఇన్‌స్టాలో హార్దిక్ రాసుకొచ్చాడు.

మెరిసిన మాస్టర్ అథ్లెట్లు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నార్త్‌అమెరికా వేదికగా జరుగుతున్న పాన్ అమెరికన్ ఇంటర్నేషనల్ మాస్టర్స్ గేమ్స్ టోర్నీలో తెలంగాణకు చెందిన జ్జీవన్ రెడ్డి, శ్యామల పతకాలతో మెరిశారు. గురువారం జరిగిన పురుషుల జావెలిన్‌త్రో విభాగంలో జ్జీవన్‌రెడ్డి 22.56మీటర్ల దూరం బరిసెను విసిరి పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. మరోవైపు మహిళల షాట్‌పుట్‌లో శ్యామల 5.10మీటర్ల దూరంతో కాంస్యం ఖాతాలో వేసుకుంది.

సూర్య సారథ్యంలో..

టీ20 సిరీస్‌కు కెప్టెన్‌గా ఎంపిక • వన్డేలకు రోహిత్, కోహ్లీ రాక • వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్‌గిల్

న్యూఢిల్లీ: శ్రీలంకతో టీ20, వన్డే సిరీస్‌ల కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) గురువారం రెండు వేర్వేరు జట్లను ఎంపిక చేసింది. ఈ నెల 27నుంచి మొదయ్యే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం సూర్యకుమార్‌యాదవ్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇటీవలే వెస్టిండీస్ గడ్డపై టీ20 ప్రపంచకప్ గెలిచి కొత్త చరిత్ర లిఖించిన టీమ్ ఇండియాను సూర్య ముందుండి నడిపించనున్నాడు. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్‌పాండ్యా జట్టులోకి వచ్చినా..అజిత్ అగర్కార్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ సూర్య వైపే మొగ్గు చూపింది. జింబాబ్వేపై టీ20 సిరీస్ విజయంలో కీలమైన శుభ్‌మన్‌గిల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. డాషింగ్ బ్యాటర్ అభిషేక్‌శర్మకు చుక్కెదురు కాగా రియాన్ పరాగ్ చోటు నిలుపుకున్నాడు. మరోవైపు వన్డేల్లో దిగ్గజ ద్వయం రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ బరిలోకి దిగనున్నారు. ప్రపంచకప్ విజయం తర్వాత కుటుంబసభ్యులతో కలిసి సరదాగా గడుపుతున్న రోహిత్, కోహ్లీ..లంకతో వన్డే సిరీస్ ఆడనున్నారు. తొలుత టోర్నీకి దూరంగా ఉండాలని భావించినా..కొత్త కోచ్ గౌతం గంభీర్ సూచనల మేరకు ఒప్పుకున్నట్లు తెలిసింది. వన్డేలకు కెప్టెన్‌గా రోహిత్, వైస్‌కెప్టెన్‌గా గిల్ బాధ్యతలు పంచుకోనున్నారు. ఇదిలా ఉంటే వన్డేల్లోకి ఢిల్లీ యువ పేసర్ హర్షిత్ రానా తొలిసారి ఎంపికయ్యాడు. టీ20లు, వన్డేల్లో హైదరాబాద్ స్పీడ్‌స్టర్ మహమ్మద్ సిరాజ్ చోటు దక్కించుకున్నాడు.

అమ్మాయిల ఆసియా పోరు

పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్

నేటి నుంచి మెగాటోర్నీ షురూ • డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో భారత్

దంబుల్లా: ప్రతి రెండేండ్లకోమారు జరిగే మహిళల ఆసియా కప్‌నకు వేళ్లైంది. శుక్రవారం నుంచి దంబుల్లా (శ్రీలంక) వేదికగా ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. ఆసియాలోని 8 జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి ఆడనున్న ఈ టోర్నీలో నేపాల్-యూఏఈ మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది. టీ20 ఫార్మాట్‌లో నిర్వహించే ఈ మెగా ఈవెంట్ తొలి రోజే డిఫెండింగ్ చాంపియన్ భారత్.. పాకిస్థాన్‌తో రాత్రి 7 గంటలకు ఆడబోయే మ్యాచ్‌తో టైటిల్ వేటను ఆరంభించనుంది. శుక్రవారం నుంచి ఈ నెల 24 దాకా జరిగే ఈ టోర్నీలో 8 జట్లు 15 మ్యాచ్‌లు ఆడనున్నాయి. గ్రూప్-ఏలో భారత్, పాకిస్థాన్‌తో పాటు నేపాల్, యూఏఈ కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. గ్రూప్-బీలో శ్రీలంక, బంగ్లాదేశ్, మలేషియా, థాయ్‌లాండ్ ఉన్నాయి. లీగ్ దశలో ప్రతి జట్టూ మూడు మ్యాచ్‌లు ఆడనుంది. గ్రూప దశ ముగిసేటప్పటికీ టాప్-2లో ఉన్న రెండు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. 26న రెండు సెమీస్‌లు, 28న ఫైనల్ జరుగనుంది. మ్యాచ్‌లన్నీ దంబుల్లా వేదికగానే జరుగుతాయి.

భారత్ సూపర్ ఫామ్:

స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన సూపర్ ఫామ్‌లో ఉండగా షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్‌తో కూడిన బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న టీమ్ ఇండియాకు రేణుకా సింగ్, పూజా వస్త్రకార్, అరుంధతిరెడ్డి రూపంలో పటిష్టమైన పేస్ బలగం ఉంది. రాధా యాదవ్, దీప్తిశర్మ, శ్రేయాంక పాటిల్, ఆశా శోభన రూపంలో నాణ్యమైన స్పిన్నర్లు కలిగిన భారత్ మరోసారి టైటిల్ నెగ్గాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.